క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ సీజ్



సీజ్ చేస్తున్న తహసీల్దార్ సరిత

పెంచికల్‌పేట్: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు తహసీల్దార్ సరిత బుధవారం పేర్కొన్నారు. చేడ్వాయి గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని గోబిరె తిరుపతికి రూ.5వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ట్రాక్టర్ యజమానులు అనుమతులు లేకుండా ఇసుక తరలించవద్దన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

‘దళితబంధు’పై విచారణ చేపట్టాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: దళితబంధు పథకంలో అక్రమాలకు పాల్పడిన నాయకులపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద బీఎస్పీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా ఇన్‌చార్జి సాగర్ మాట్లాడుతూ దళితబంధులో అర్హులను కాకుండా కమీషన్లు ఇచ్చిన వారిని ఎంపిక చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు పోచం, మహేష్, రాంచందర్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

జాతీయ సమగ్రతకు పాటుపడాలి



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: యువత జాతీయ సమగ్రతకు పాటుపడాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చిరంజీవి అన్నారు. ఏఐవైఎఫ్ 64వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో నిరుద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు. డిగ్రీ పూర్తయిన ప్రతిఒక్కరికి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్, మల్లికార్జున్, గణేశ్, సురేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రమశక్తి అవార్డు గ్రహీతకు సన్మానం



చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

రెబ్బెన: ప్రపంచ కార్మికుల దినోత్సవం మేడే సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శ్రమశక్తి అవార్డు అందుకున్న కైరిగూడ ఓసీపీ సీనియర్ మైనింగ్ సర్దార్ గజ్జెల్లి చంద్రశేఖర్‌ను బుధవారం ఓసీపీ అధికారులు ఘనంగా సన్మానించారు. ప్రాజెక్టు పీవో ఉమాకాంత్, గని మేనేజర్ ప్రవీణ్ ఫటింగ్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావుతో పాటు టీబీజీకేఎస్, ఏఐటీయూసీ నాయకులు పూలమాలలతో సన్మానించారు. టీబీజీకేఎస్ ఏరియా మాజీ ఉపాధ్యక్షుడు సదాశివ్, ఫిట్ కార్యదర్శి వెంకటేష్, నాయకులు నర్సింగరావు, తిరుపతి, మొగిలయ్య, లక్ష్మయ్య, వెల్ఫేర్ అధికారి వేణు తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో ప్రమాదాలు నివారించాలి



పోస్టర్లతో విద్యుత్ అధికారులు

వాంకిడి: వినియోగదారులు జాగ్రత్తలు పాటిస్తే విద్యుత్ ప్రమాదాలను నివారించవచ్చని విద్యుత్ శాఖ ఏడీ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సెక్షన్ కార్యాలయంలో నిర్వహించిన భద్రతా వారోత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రత నిబంధనలతో కూడిన పోస్టర్లను ప్రదర్శించారు. వారం రోజుల పాటు డివిజన్ వ్యాప్తంగా భద్రతా వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఈ శ్రీకాంత్, సబ్ ఇంజనీర్ సౌమ్యశ్రీ, ఎస్ఎల్ఐ శ్రీనివాస్ రావు, సిబ్బంది జెఎల్ఎం వెంకటేష్, సతీష్, సంతోష్, శ్రీనివాస్, శ్యామ్ పాల్గొన్నారు.

నర్సరీ.. రెండు ప్రయోజనాలు

- నర్సరీల్లో కూలీలకు ఉపాధి
- హరితహారానికి మొక్కలు సిద్ధం



గోలేటి నర్సరీలో పని చేస్తున్న కూలీలు



రెబ్బెన నర్సరీలో హరితహారం కోసం పెంచుతున్న మొక్కలు

రెబ్బెన: గ్రామాల్లో పచ్చదనాన్ని పెంచేందుకు ఏర్పాటు చేసిన నర్సరీలతో రెండు రకాల ప్రయోజనాలు చేకూరుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ సంవత్సరం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హరితహారం కార్యక్రమానికి కావాల్సిన మొక్కల కోసం ప్రతీ పంచాయతీకి ఒక్కటి చొప్పున నర్సరీలు ఏర్పాటు చేశారు. ఈ నర్సరీల ద్వారా హరితహారానికి మొక్కలు సిద్ధమవుతుండగా, కూలీలకు ఉపాధి సైతం దొరుకుతోంది. అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకంగా నర్సరీలు ఏర్పాటు చేసి ప్రజలకు పంపిణీ చేసేందుకు అవసరమైన మొక్కలతో పాటు రోడ్లు, ఖాళీ ప్రదేశాల్లో నాటేందుకు అవసరమైన మొక్కలను నర్సరీల్లో పెంచుతున్నారు.

ప్రతీ పంచాయతీకి 40వేలు టార్గెట్..

హరితహారం కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది ప్రతీ పంచాయతీలో 40వేల మొక్కలు నాటాలని ప్రభుత్వం ఆదేశించింది. మండలంలో 24 గ్రామ పంచాయతీలుగా ఉండగా 24 నర్సరీలు ఏర్పాటు చేశారు. ప్రతీ పంచాయతీలో నాటేందుకు అవసరమైన మొక్కలను నర్సరీల ద్వారా సమకూర్చేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. నర్సరీల అభివృద్ధిపై పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఎరువులు, ఎర్రమట్టితో ప్రత్యేకంగా బెడ్లను సిద్ధం చేసి మొక్కలు పెంచుతున్నారు. ప్రధానంగా ప్రజలకు పంపిణీ చేసేందుకు, ఇళ్లల్లో నాటేందుకు అనువైన జామ, సీతాఫలం, దానిమ్మ, చింత, నిమ్మ, కరివేపాకు, గోరింటాకు వంటి మొక్కలపై ప్రత్యేక దృష్టి సారించారు. తరువాత ప్రాధాన్యత క్రమంలో ఎవెన్యూ ప్లాంటేషన్‌కు, గ్రామ అవసరాలకు అనుకూలమైన టేకు, అల్లనేరేడు, రావి, మర్రి, గుల్‌మోర్గా వంటి మొక్కలను నర్సరీల ద్వారా హరితహారం కోసం సిద్ధం చేస్తున్నారు.

ఉపాధి పొందుతున్న కూలీలు

నర్సరీలతో ఆయా గ్రామాల్లోని కూలీలకు ఉపాధి లభిస్తుండటంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నర్సరీలో రోజుకు కనీసం 5 నుంచి 10 మంది కూలీలు పని చేయాల్సి ఉంటుంది. ప్రారంభంలో ప్లాస్టిక్ బ్యాగుల్లో మట్టి నింపడం, మట్టికి ఎరువులు కలిపి మొక్కలు నాటేందుకు బెడ్లు సిద్ధం చేయడం, విత్తనాలు నాటడం, నీళ్లు పట్టడం వంటి పనులతో పాటు ప్రస్తుతం నర్సరీ నిర్వహణ, మొక్కలకు నీళ్లు అందించడం వంటి పనుల కోసం ఉపాధిహామీ పథకం ద్వారా కూలీలకు పనులు కల్పిస్తున్నారు.

కూలీలకు ఉపాధి



పంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీల ద్వారా రెండు రకాల ప్రయోజనాలు చేకూరుతున్నాయి. హరితహారం ద్వారా గ్రామాల్లో నాటేందుకు అవసరమైన మొక్కలు సిద్ధమవుతుండగా, కూలీలకు పని సైతం దొరుకుతోంది. ప్రతీరోజు మొక్కలకు నీళ్లు పట్టడం, చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటడం వంటి పనులను ఉపాధిహామీ కూలీలతో చేయిస్తున్నాం. - శ్రీనివాస్, ఎంపీడీవో

అధికారులు పనితీరు మార్చుకోవాలి

- సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సక్కు

ఆసిఫాబాద్‌రూరల్: అధికారులు తమ పనితీరు మార్చుకొని ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మల్లికార్జున్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావుతో కలిసి హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలు పని చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరి గ్రామాలకు త్రీఫేజ్ కరెంట్ ఇవ్వడంలో ఆలస్యం చేయకూడదన్నారు. జెడ్పీటీసీ నాగేశ్వర్ రావు మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా మండలంలో గుర్తించిన 326 మందికి ఆపరేషన్ చేయిస్తామని, దాని కోసం ప్రణాళిక రూపొందించాలని పేర్కొన్నారు. మండలంలోని పెండింగ్‌లో ఉన్న గ్రామాల్లో భగీరథ నీటి సరఫరా కోసం నల్లాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎంపీపీ మల్లికార్జున్ మాట్లాడుతూ చాలా గ్రామాల్లో లీకేజీల వల్ల మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదన్నారు. లీకేజీలకు సంబంధించి మరమ్మతులు చేపట్టి ప్రతీ ఇంటికీ మంచి నీరు అందించాలని పేర్కొన్నారు. సర్పంచ్‌లు భీమేష్, మహేష్‌లు మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి కోసం చేసిన పనులకు సంబంధించిన బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, ఎంపీవో ప్రసాద్, ఎంపీవో చంద్రశేఖర్, అధికారులు పాల్గొన్నారు.

జేపీఎస్, ఓపీఎస్‌లను క్రమబద్ధీకరించాలి

- ఎంపీపీ డుబ్బుల నానయ్య
- అర్ధాంతరంగా సర్వసభ్య సమావేశం బహిష్కరణ
- సమ్మెకు మద్దతు తెలిపిన సభ్యులు



మాట్లాడుతున్న ఎంపీపీ డుబ్బుల నానయ్య

చింతలమానెపల్లి: జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని, వారి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఎంపీపీ డుబ్బుల నానయ్య అన్నారు. వారికి మద్దతు తెలుపుతూ బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశాన్ని అర్ధాంతరంగా బహిష్కరించారు. సమావేశం జరుగుతున్నప్పుడు కొంతమంది సభ్యులు సమ్మెలో పాల్గొన్న జేపీఎస్, ఓపీఎస్‌లకు తమ మద్దతు ప్రకటించారు. మిగిలిన సభ్యులు సైతం వారిబాటలో నడిచారు. దీంతో సమ్మెకు మద్దతు తెలుపుతూ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ఎంపీపీ ప్రకటించారు. అంతకుముందు కొన్ని శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. ప్రభుత్వం 24గంటలు వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ప్రకటిస్తుందని, కాని రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరా చేయడం లేదని సభ్యులు ఆరోపించారు. దీనికి రాత్రి వేళల్లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ ప్రశాంత్ సమాధానం ఇచ్చారు. కొత్త వ్యవసాయ కనెక్షన్లకు దరఖాస్తులు చేసుకుని ఏళ్లు గడుస్తున్నాయని, వెంటనే కనెక్షన్లు ఇవ్వాలని సభ్యులు కోరగా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ‘మన ఊరు మన బడి’లో భాగంగా పనులు పూర్తయిన పాఠశాలల్లో వాచ్‌మెన్‌లను నియమిస్తున్నట్లు ఎంఈవో సోమయ్య తెలిపారు. ఏఎన్ఎంలు గ్రామాల్లో అందుబాటులో ఉండడం లేదని ఆరోగ్య ఉపకేంద్రాలకు రూ.లక్షల నిధులతో భవనాలు నిర్మించినా కనీసం తెరవడం లేదని ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు మండలంలోని రుద్రాపూర్ నుంచి బెజ్జూర్ మండలం కుంటలమానెపల్లి వరకు రహదారిని అభివృద్ధి చేయాలని కోరారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయని వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

జేపీఎస్‌లకు మద్దతుగా..

సమావేశంలో మధ్యలోనే సర్పంచ్‌లు చౌదరి నానయ్య, జాటోత్ సోమేష్, మోర్లె గణపతిలు జేపీఎస్, ఓపీఎస్‌లకు మద్దతుగా సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం మిగిలిన సభ్యులు సైతం వారికి మద్దతు తెలిపారు. తహసీల్దార్ ముష్కార్ అలీ, ఎంపీడీవో మహేందర్, ఎంపీవో సుధాకర్ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు నాజిం హుస్సేన్, ఏవో రామక్రిష్ణ, సెరికల్చర్ అధికారి శాంతి ప్రియ, విద్యుత్ శాఖ ఎస్ఈలు ప్రశాంత్, జగన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీకి కార్యాచరణ రూపొందించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీకి కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ రాజేశంతో కలిసి గొర్రెల పంపిణీ కార్యక్రమ నిర్వహణపై బుధవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గొర్రెల పెంపకందారుల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతి కోసం ప్రభుత్వం గొర్రెల పంపిణీ కార్యక్రమం చేపట్టిందన్నారు. 2వ విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంలో గొర్రెల కొనుగోలు, సేకరణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాకు కేటాయించిన 1588 యూనిట్ల లక్ష్యానికి అనుగుణంగా గొర్రెలను సేకరించేందుకు జిల్లాస్థాయి అధికారులను నియామించామని పేర్కొన్నారు. లబ్ధిదారులు స్వయంగా ఎంపిక చేసుకున్న తర్వాత యూనిట్ల గొర్రెలను వారి ప్రాంతాలకు చేర్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాకు మహారాష్ట్రలోని చంద్రపూర్, ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాల నుంచి గొర్రెలను సేకరించేందుకు మార్గదర్శకాలు ఉన్నాయని పేర్కొన్నారు. అనంతరం ఉద్యానవన శాఖ అధికారులతో కొత్త కలెక్టరేట్ భవన ఆవరణలో అవసరమైన మొక్కలు, పూల మొక్కలు, నీడనిచ్చే మొక్కలను నాటించే కార్యక్రమం వేగవంతం చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, గ్రామ పంచాయతీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ భవన సముదాయానికి మిషన్ భగీరథ నీటిని అందించేందుకు పనులు పూర్తి చేయాలని మిషన్ భగీరథ ఏఈకి సూచించారు.

ఆరోగ్య మహిళ కేంద్రాలు సమర్థవంతంగా నిర్వహించాలి

ఆరోగ్య మహిళ కేంద్రాలు సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. రక్తహీనత కేసుల వివరాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న ఖాళీల వివరాలతో పీహెచ్‌సీల వారీగా నివేదిక సమర్పించాలని ఆదేశించారు. హైరిస్క్ గర్భిణీలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రథమ, ద్వితీయ, ట్రైమిస్టర్ కార్యక్రమాలు చేపట్టాలని, అవసరమైన వారికి మందులు పంపిణీ చేయాలన్నారు. ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. డీఎంహెచ్‌వో రామకృష్ణ, ఉప వైద్యాధికారులు సుధాకర్‌నాయక్, సునీల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

‘నిధులు దుర్వినియోగం కాలేదు’

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని శ్రీ కోదండ రామాలయానికి సంబంధించిన నిధులు దుర్వినియోగమైనట్లు కొంత మంది చేసిన ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని ఆలయ కమిటీ వైస్‌చైర్మన్, ఎస్‌వోటూజీఎం కేహెచ్ఎన్ గుప్తా, ఆలయ కార్యదర్శి ఎస్. ప్రకాష్‌రావు, కమిటీ సభ్యులు మల్రాజు శ్రీనివాస్ రావు, ఎస్. తిరుపతిలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయానికి సంబంధించిన ఆదాయ వ్యయాలు కమిటీ పర్యవేక్షణలో పారదర్శకంగా సాగుతున్నాయన్నారు. నిపుణుల ద్వారా ఆలయానికి సంబంధించిన ఆదాయ వ్యయాలను పరిశీలించి ఏప్రిల్ 2023 వరకు రామాలయం ఖాతాలో రూ. 2,26,126లు ఉన్నట్లు నిర్ధారించారని తెలిపారు. అనుమానాలు ఉంటే ఆలయ ఆదాయ వ్యయాలు, మిగులు పరిశీలించాలన్నారు.

స్ట్రోమ్ వాటర్ డ్రైన్ పనులు ప్రారంభం

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని 10వ వార్డులో రూ.18 లక్షల పట్టణ ప్రగతి నిధులతో 300 మీటర్ల తో స్ట్రోమ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులను బుధవారం మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్ వైస్ చైర్మన్ గిరీష్ కుమార్, వార్డు కౌన్సిలర్ వనమాల విజయ రాములతో కలిసి ప్రారంభించారు. చైర్మన్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కమిషనర్ అంజయ్య, నాయకులు శ్రీనివాస్, నారాయణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

‘కంటివెలుగు’ శిబిరం ప్రారంభం



ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ అజయ్‌కుమార్

వాంకిడి: మండలంలోని గోయేగాం గ్రామపంచాయతీ కేంద్రంలో బుధవారం కంటివెలుగు శిబిరాన్ని జెడ్పీటీసీ అజయ్‌కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అంధత్వాన్ని నిర్మూలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కంటివెలుగు శిబిరాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోఆప్షన్ సభ్యుడు అహ్మద్ ఖాన్, ఉప సర్పంచ్ బబ్లూ, పంచాయతీ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రుద్రాపూర్‌లో ‘కంటివెలుగు’

చింతలమానెపల్లి: మండలంలోని రుద్రాపూర్‌లో గురువారం నుంచి కంటి వెలుగు శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి బండి సాయిక్రిష్ణ గౌడ్ తెలిపారు. గత ఎనిమిది రోజులుగా ఖర్జెల్లిలో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరం బుధవారం ముగిసింది. ఖర్జెల్లిలో మొత్తంగా 973 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి తెలిపారు. ఏఎన్ఎంలు, వైద్యశిబిరం సిబ్బంది పాల్గొన్నారు.

డీఎంఎఫ్‌టీ నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: డీఎంఎఫ్‌టీ నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దినకర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని బొగ్గు గనుల ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారన్నారు. ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు ఏటా రూ. కోట్లలో విడుదల చేసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోతోందన్నారు. నిధుల ఖర్చుపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కార్తీక్, రాజ్‌కుమార్, టీకానంద్, శ్యామ్ తదితరులు ఉన్నారు.

అందరి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పూలదండ వేస్తున్న ఎమ్మెల్యే ఆత్రం సక్కు



నివాళులర్పిస్తున్న కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్: అందరి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. బుధవారం మండలంలోని పర్సనంబాల గ్రామంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగేశ్వర్ రావుతో కలిసి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయాల కోసం పని చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా హైదరాబాద్‌లో అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్, సర్పంచ్ విమల, కిష్టయ్య, బాపురావు, భీమేష్, నాయకులు లింగయ్య, లుంబిని దీక్ష కమిటీ అధ్యక్షుడు మనోహర్, ప్రకాష్ తదితరులు ఉన్నారు.

వీర్దండిలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ



పూలమాలలు వేస్తున్న కొత్తపల్లి శ్రీనివాస్

కౌటాల: మండలంలోని వీర్దండి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని భంతేజీ బుధవారం ఆవిష్కరించారు. విగ్రహావిష్కరణ సందర్భంగా గ్రామంలో మహర్ కులస్తులు ధమ్మ ర్యాలీ తీశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. విగ్రహావిష్కరణ సందర్భంగా రాత్రి ఉచిత మరాఠీ నాటిక ప్రదర్శన చేశారు. ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, నాయకులు పాల్గొన్నారు.

మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సక్కు

రెబ్బెన: ఇందిరానగర్‌లోని కనకదుర్గాదేవీ, స్వయంభూ మహంకాళి అమ్మవారిని బుధవారం ఎమ్మెల్యే ఆత్రం సక్కు దర్శించుకున్నారు. ఆలయంలో నిర్వహిస్తున్న జాతర సందర్భంగా బుధవారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యేకు ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్ స్వాగతం పలికారు. ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, నాయకులు దుర్గం రాజేష్, వెంకటేశం చారి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కౌటాల: మండలంలోని విజయనగరం సెయింట్ జోసెఫ్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో 2001-02 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను ఆహ్వానించి సన్మానించారు.

బైపాస్ రోడ్డు పనుల పరిశీలన

మంచిర్యాలటౌన్: పట్టణంలో చేపడుతున్న బైపాస్ రోడ్డు పనులను ఎమ్మెల్యే దివాకర్‌రావు బుధవారం పరిశీలించారు. రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని, వర్షాకాలానికి ముందే రోడ్డును వినియోగంలోకి తీసుకొచ్చేలా చూడాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజయ్య, వార్డు కౌన్సిలర్లు మాదవి, పద్మ, పాల్గొన్నారు.

సమస్యలపై ఆరా

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలోని 6వ వార్డులో బుధవారం మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వార్డు కౌన్సిలర్ సుంకరి శ్వేతతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులో డ్రెయినేజీ లేని కాలనీ చివరి ఇళ్ల వద్ద ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, డ్రెయినేజీ నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని తెలిపారు. వార్డు నాయకులు సుంకరి రమేశ్, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని పశువైద్యశాల సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఆసిఫాబాద్ మండలం ఇటిక్యాలకు చెందిన దంపతులు వెంకటేశ్ -హారికలు, బైక్‌పై వస్తున్న చింతనమానెపల్లి మండలం రణవెల్లికి చెందిన సంతోశ్‌లు ఎదురెదురుగా ఢీకొన్నారు. దీంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం మంచిర్యాలకు తరలించారు.

టార్పాలిన్లు అందజేత

లక్సెట్టిపేట: మండలంలోని చందారం గ్రామంలోని రైతులకు, రైతు పరస్పర సహాయ సహకార సంఘంలోని సభ్యులకు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మంచిర్యాల ఆధ్వర్యంలో బుధవారం టార్పాలిన్లు అందజేశారు.